# ఓ అమ్మ కథ

వాలి హిరణ్మయీదేవి



"అత్తయ్యా ! మీ అబ్బాయి కథకి ఫస్ట్ ప్రైజ్ వచ్చిందట. ఫోన్ చేసి చెప్పారు" సంతోషంగా చెప్పింది పద్మజ.

"అలాగా ! కథేంటో ?" ఆసక్తిగా అడిగింది భూజాతమ్మ.

"ఏమో... అయ్యో... ఇంతకీ ఎంత డబ్బు వస్తుందో అడగడం మరిచాను. ఈసారి ఎలాగైనా మరో పట్టు చీర కొనిపించుకోవాలి" అంది పద్మజ.

"పిచ్చిపిల్లా ! ఎన్ని చీరలున్నా చీరల పిచ్చే. అస్తమానం స్టీల్ సామాను కొంటుంది గట్టి బట్టల నిచ్చేస్తూ. ఆ బట్టలనే ఎవరికన్నా ఇస్తే కళ్ళకద్దుకుని మరో నాలుగేళ్ళు కట్టుకుంటారు —ఆ మాటే పైకి చెబితే "మీ దంతా చాదస్తం" అంటూ కొట్టిపారేస్తుంది. ఇంతకీ వాడు రాసిన కథేంటో. ఈ పిల్లదేమో ఇంగ్లీషు మీడియం చదువు. తెలుగు చదివి వినిపించదు. ఎవరి చేతన్నా చదివించుకోవాలంటే —ఇంటి చుట్టుప్రక్కల వాళ్ళందరిదీ ఇదే పరిస్థితి. ఉద్యోగాలు, షికార్లు, క్లబ్‌ల పేరుతో తిరిగే కల్చరున్న ఆడవాళ్ళే తప్ప ఇంటి పట్టున ఉండేవాళ్ళు తక్కువ.

తను ఇదివరకైతే ఏదో కూడబలుక్కుని చదివేది. ఇప్పుడు చూపు సరిగ్గా ఆనక ఆ పనికి స్వస్తి చెప్పేసింది. పోనీ కొడుకునే అడుగుదామంటే — ఎప్పుడూ బిజీగా ఉంటాడు. లేచింది మొదలు ఆఫీస్‌కెళ్ళేంత వరకూ ఏదో ఒకటి రాసుకుంటూ ఉంటాడు. సాయంత్రం వచ్చి ఓ కప్పు కాఫీ త్రాగి ఏ సాహితీ సభలకో, సమావేశాలకో వెళ్ళి పదీ, పదకొండు గంటలగ్గానీ ఇల్లు చేరడు. ఇంట్లో అడిగినంత డబ్బు ఇచ్చేసి 'అమ్మయ్య ! బాధ్యత తీరిందనుకుంటాడు ప్చ్ ! భారంగా నిట్టూర్పు విడిచింది" అన్ని విషయాలూ భూజాతమ్మే చూసుకుంటుంది. "తను పోతే ఎలా ?" అనుకుంటూ బాధ పడుతూంటుంది. పద్మజకి ఇంటి విషయాలే పట్టవు. ఎంతసేపూ ట్రిమ్‌గా తయారై ఆడా మగా తేడా లేకుండా ఫ్రెండ్స్‌తో హస్క్ కొట్టడం, సినిమాలకు వెళ్ళడం, షికార్లకు వెళ్ళడం అలవాటు. అవన్నీ పట్టించుకుని మందలించే టైమే లేదు ఆమె పతిదేవుడైన మురళీధర్‌కి.

ఏ మూడు నెలలకోసారి తల్లిని చూడడానికి వచ్చే ఆమె కూతురు లక్ష్మికి, పద్మజంటే కోపం —తల్లినంతగా కష్టపెడుతున్నందుకు —తనతో రమ్మంటే రాని తల్లి మీద కోపం తెచ్చుకున్నా — మళ్ళీ మాట్లాడుతూంటుంది. ఆమె వచ్చినప్పుడు ఏ కథన్నా చదివి వినిపించమంటుంది తల్లి. ఆమె కోరిక తీర్చడానికి మాగజైన్ చేతిలో తీసుకోగానే ఏ పిల్లో, పిల్లాడో పని కల్పించడం, దాంతో సగంలో వదిలెయ్యడం జరుగుతూంటుంది సామాన్యంగా.

కూతురు లక్ష్మితో "కాలేజీ రోజుల్లో కథలు రాసేదానివిగా. నువ్వు మళ్ళీ కథలు రాయొచ్చుగా?" అంది భూజాతమ్మ. "అమ్మో ! మా ఉమ్మడి కుటుంబంలో పది నిమిషాలు ఖాళీ దొరికితే ఎంతో గొప్ప. అదీగాక మా వాళ్ళెవరికీ ఇంట్రెస్ట్ లేదమ్మా" అంటూ ఉంటుంది లక్ష్మి కథల ప్రస్తావన వచ్చినప్పుడల్లా.

ఆ రాత్రి ఎప్పటికన్నా ఓ గంట ఆలస్యంగావచ్చాడు మురళీధర్. 'నిద్రపోతున్న పిల్లనెందుకు లేపడం' అనుకుంటూ ఎప్పట్లాగే అన్నం వడ్డించింది భూజాతమ్మ —సాయంత్రం నుంచీ కీళ్ళ నొప్పులతో బాధపడుతూ ఉన్న తల్లి అవస్థ గ్రహించి —

"అమ్మా ! పద్మజని లేపకపోయావా ? మళ్ళీ కాళ్ళు నొప్పెడుతున్నాయా ?... డాక్టర్ దగ్గరికి వెళ్ళకపోయావా ?" అన్నాడు మురళీధర్ కాస్త

నొచ్చుకుంటూ. ఆ మాత్రం దానికే కరిగిపోయింది భూజాతమ్మ.

"మరేం ఫర్వాలేదు లేరా ? ఆ కాస్త దానికి పిల్లని నిద్ర ఎందుకు చెడగొట్టడం అన్నట్లు నీ కథకేదో ప్రైజ్ వచ్చిందటగా —ఏం కథరా అది ?" అంది కాస్త ఆసక్తిగా.

"ఆ... ఏదో... ఉందిలే... తర్వాత చెబుతాను... ప్రొద్దుటే లేవాలి" అన్నాడు గబగబా అన్నం కలుపుతూ.

"వీడెప్పుడూ ఇంతే" అనుకుంటూ నిట్టూర్చింది భూజాతమ్మ. నిద్రకొరిగే ముందు తల్లి మళ్ళీ అడిగింది. ఇబ్బందిగా ఫీలయ్యాడు మురళీధర్. తను రాసిన కథని తల్లికెలా చెప్పగలడసలు? ఆ జంకుతోనేగా ఎప్పటికప్పుడు వాయిదా వేసేది. మరి అలాంటి వయసున్నన్న పాఠకురాళ్ళు ఎందరో ఉంటారన్నది స్ఫురించలేదతనికి. అంతెందుకు తన భార్యకి చదివి వినిపించగలడా ? ఆమెకి తెలుగు రాకపోవడం వల్ల తను ఇంత నిస్సంకోచంగా రాయగలుగుతున్నాడా ? ఒకసారి కథంతా మననం చేసుకున్నాడు... "ఒక ఇల్లాలు, తన భర్త నిర్లక్ష్యం వల్ల, క్యాంపులకు తరచూ వెళుతుండడం వల్ల తాను ఓర్చుకోలేక పక్కింటి కుర్రాడితో సంబంధం పెట్టుకుంది. కొన్నాళ్ళయ్యాక అనుకోకుండా క్యాంప్ క్యాన్సిలయి ఇంటికొచ్చిన భర్త కళ్ళల్లో పడతారిద్దరూ. తన మూలంగానే భార్యలా తయారైంది కాబట్టి తన ప్రవర్తన మార్చుకోవాలని నిర్ణయించుకుంటాడా భర్త. ఇదీ స్థూలంగా కథ. ఓసారి ఓ ఇల్లాలు భర్త బాధలు భరించలేక ఇల్లొదిలి వెళ్ళినట్లురాస్తే "ధైర్యంతో ఎదుర్కొనేటట్టు రాయక పిరికితనంతో పారిపోయి నట్లు రాశావేంటి" అంది తల్లి. ఇప్పుడిహ ఆ కథ చదివి వినిపిస్తే ఏమంటుందో —ఇబ్బందిగా కదిలాడు. ఆ కథ నామె కంటపడకుండా ఉంచాలి. పైనే ఉంటే అక్క వచ్చినప్పుడు చదివించుకునే ప్రమాదం ఉంది. అసలే అక్కకి కూడా కథల పిచ్చి —ఆ మాగజైన్ను లోపల దాచేయాలి. "నీ కథలని నీ ఇంట్లో వాళ్లే చదవనంతగా రాసి పాఠకుల మీదికి ఆ విషపు బాణాల్ని ఎలా వదులుతున్నావ్" అని అంతరాత్మ నిలదీస్తోంటే బదులు చెప్పలేక నిద్రమాత్రల నాశ్రయించాడు —మురళీధర్ ——అదేమిటో అతను అలాంటి కథలు రాస్తోన్నా — అందరూ "స్త్రీవాద రచయితం" టూ పొగుడుతుంటారు.

రోజులు గడుస్తున్నాయ్ తల్లి కొన్ని రోజులుగా డల్గా కన్పిస్తుంటే ఏంటమ్మా అలా ఉంటున్నావ్. డాక్టర్ దగ్గరికి వెడదామా' అంటూ అడిగితే, వయసు మీద బడుతున్న కొద్దీ డల్గా కాక ఎలా ఉంటాను ఈ మాత్రం దానికి డాక్టరెందుకు "అంటూ తేలిగ్గా తీసిపారేస్తే, ఇక ఆ విషయం గురించి అంతగా ఆలోచించలేదతను.

ఇంతలో ఉగాది పండుగ వచ్చింది "నేనున్నా లేకున్నా" ఏడాదిలో ఏదో ఒక పండుగకి నీ అక్కా చెల్లెళ్ళని పిలిచి నీకు శక్తిని బట్టి వాళ్ళకి

పెళ్లికి ముందు, పెళ్లి తర్వాత అనే పుస్తకం రాస్తున్నాను గురూ! ఫ్రెండ్కు చెప్పాడు రచనానుభవం గల తన మిత్రుడు

ఆ టైటిల్ బాగాలేదు గురూ

ఇంకేమని నామకరణం చేయమంటావు?

స్వర్గం, నరకం, అంటే భేషుగ్గా ఉంటుంది. పెళ్లైన ఫ్రెండ్ దీనవదనంతో సలహా ఇచ్చాడు.

-డి. పాపయ్య, గుత్తి



తోచింది పెట్టి పంపిస్తూ ఉండరా. పుట్టింటి నుండి పూచికపుల్ల వచ్చినా ఇంటి ఆడపడుచుల కది ఎంతో తృప్తిగా ఉంటుంది అని తల్లి అన్న మాటలు గుర్తు కొచ్చాయి. అప్పటి నుంచీ అలాగే చేస్తూ వచ్చాడు. అదే ఊళ్ళోనే ఉన్నా— రాకపోకలు అంతంత మాత్రమే. కనీసం పండుగ పేరుతోనైనా తన తల్లి కోరిక, తీరుతుంది. ఇటు తన వాళ్ళతో సరదాగా గడపటం జరుగుతోంది. అతని బిజీ లైఫ్లో అతడంత సరదాగా ఉండటం ఉగాది పండుగప్పుడే.

"ఒరేయ్ మురళీ! అమ్మని ఓ పదిరోజుల పాటు మా ఇంటికి తీసుకు వెడతారా" అంది అక్క లక్ష్మి వెళ్ళేరోజున.

"ఏం ఎందుకు? అమ్మకిష్టమయితే అలాగే తీసుకువెళ్ళు" అన్నాడు మురళీధర్. అంతవరకు తల్లినెపుడు వదిలి ఉండలేదు కాబట్టి.

"అమ్మకీ వయసులో రెస్ట్ చాలా అవసరం. నువ్వు ఇంట్లోకి డబ్బు పారేయగానే చాలదురా. అమ్మని కాస్త జాగ్రత్తగా చూసుకుంటూ ఉండాలి" అంది లక్ష్మి. ఆ సాయంత్రం తల్లిని తీసుకొని వెళ్ళిందామె. ఆమె ఎందుకలా అన్నదో రెండ్రోజుల్లోనే తెలిసొచ్చిందతనికి. పద్మజకి ఏ పనీ సరిగ్గా రాదు. ఇంతకాలం తల్లి ఉండి అన్ని చేసుకోడంతో ఇల్లూ బట్టలు అన్నీ నీట్గా ఉన్నాయ్ రెండ్రోజుల్లోనే చీదరగా మారిన ఇంటిని చూస్తేగానీ అర్థం కాలేదు. అలాగే, కోడలే వంట చేస్తోందంటూ తల్లి చెప్పింది అబద్ధమనీ తెలిసిపోయింది. పద్మజ వండి పెట్టిన వాటి రుచి చూశాక పద్మజని విసుక్కోబోయినా ఆమె సాగించే అలక గుర్తొచ్చి విరమించుకున్నాడు. అక్కడికీ తల్లివచ్చాక ఎన్నెన్ని పనులు ఆమెతో మాన్పించాలో పద్మజకి వివరించాడు. అతడికి తల్లంటే అంతులేని ప్రేమ, కానీ మాటల్లో వ్యక్తం చేయడెప్పుడు.

నాలుగురోజుల తర్వాత తల్లిని చూడటానికి అక్క లక్ష్మి ఇంటికి వెళ్ళాడతను. వడలినట్లు కనిపించే తల్లి కాస్త సేదదీరినట్లు కనిపించగానే అర్థమైంది. అక్కడామె ఎంత సుఖంగా ఉందో. దాంతో తనతో రమ్మని అనబోయి మానుకొన్నాడు.

కానీ తల్లి చేతిసంచితో వచ్చి పిల్లల్ని చూడకుండా ఉండలేక పోతున్నా పదరా మనింటికి అనే సరికి ఎక్కడలేని ఆనందం కలిగిందతనికి.

పదిహేను రోజులు గడిచాయ్. ఆరాత్రి మురళీధర్కి అన్నం వడ్డిస్తూ, సాయంత్రం నుంచి అత్తయ్యగారికి ఒంట్లో బాలేదండి" అంది పద్మజ.

"ఆ... మరి రాగానే చెప్పలేదేం?" అంటూ ముద్ద నోట్లో పెట్టుకుబోయే వాడల్లా వదిలేసి, చేతులు కుడుక్కొని తల్లి గదిలోకి వెళ్ళాడు. విపరీతమైన జ్వరంతో పడి ఉంది భూజాతమ్మ. తల్లినలా చూడగానే అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయ్.

"అదేంటమ్మా— పద్మనువ్వు కలిసి డాక్టర్ దగ్గరికి ఎందుకు వెళ్ళలేదు. కాస్త లేవగలవా? వద్దొద్దులే. ఉండు డాక్టర్ని పిల్చుకొస్తాను" అంటూ చొక్కా తొడుక్కుని గబగబా బైట కెళ్ళాడు మురళీధర్.

డాక్టర్ వచ్చి చూసి కంగారు పడేదేంలేదని చెప్పి, మందులవీ రాసిచ్చి బాగా రెస్ట్ తీసుకోండంటూ చెప్పి వెళ్ళాడు.

డాక్టర్ వెళ్ళిన తర్వాత ఏదో ఇంత తిన్నాననిపించి తల్లి గదిలోనే పడుకొన్నాడు మురళీధర్. నీరసంతో ఉన్న తల్లి మొహంలోకి చూస్తూ ఏంటో సీత పేరు ఎవరు ఏ విధంగా పెట్టుకున్నా కష్టాలు తప్పవేమో తనకి ఊహవచ్చిందగ్గర్నుండి తను జాబ్లో చేరేంతవరకు, తల్లి ఎంతెంత కష్టాలు పడిందీ ఒక్కసారి కళ్ళలో కదలాడాయ్. ఒక్కసారిగా తల విదిలించాడు. ఆ దుర్భర దారిద్ర్యపు రోజులు గుర్తొస్తే చాలు అతడికి చేదుమాత్ర తిన్నట్లుంటుంది. నిత్య దరిద్రంతో, మాటవినని భర్తతో, కలసిరాని అదృష్టంతో ఆమె చేసిన జీవన పోరాటం ఓహ్ అదంతా కన్నీళ్ళమయం. అలాంటి తన కథని రాయమంటుందామె. చదివి ఏడ్చే ఓపికెక్కడిది ఎవరికైనా..

రెండ్రోజుల పాటు సెలవు పెట్టి ఇంట్లోనే ఉండిపోయాడు.

అమ్మా ఈ బత్తాయిరసం తాగమ్మా! పద్మా ఇందులో గ్లూకోజ్ కలిపావా అనడుగుతూ తల్లికా గ్లాస్ అందించాడు.

"వద్దురా తాగబుద్ధి కావడంలేదు' అంది నీరసంగా భూజాతమ్మ. పోనీ ఏమన్నా వేరేవి తినాలన్పిస్తోందా. కొబ్బరిబోండా తెస్తాను. తాగుతావా? తల్లిచేతి గాజుల్ని సవరిస్తూ అడిగాడు మురళీధర్.

నా కథ రాస్తావురా?" అందామె ఉన్నట్టుండి. తుళ్ళిపడ్డాడు మురళీధర్. రాత్రేకదూ తను ఆలోచించింది. అమ్మ మనసులో

ఈ కోరిక చాలా ఉన్నట్లుంది. ఇంతకుముందూ అడిగిందిలాగే.

"ఏరా ! ఏం మాట్లాడవేం!" అంది మళ్ళీ

'అలాగేనమ్మా రాస్తాలే ముందు అవేవీ ఆలోచించకుండా రెస్ట్ తీసుకో'' అన్నాడు.

★★ ★★

ఆ మర్నాడు ఏదో వారపత్రిక పెట్టిన శృంగార కథలపోటీకి, కథ రాయబోతున్న అతనికి తల్లి అడిగిన సంగతి గుర్తొచ్చింది. ఈ శృంగార కథ రాసాక రాస్తే సరి అనుకున్నాడు మళ్ళీ తనే.

భూజాతమ్మ కాస్త లేచి తిరగగల్గుతున్నా మునుపటి శక్తి లేకుండా ఉంది. కూతుళ్ళొచ్చి చూసి వెళుతున్నారు. చూడవే వాణ్ణి నా కథ రాయమంటే ఏమీ మాట్లాడటం లేదు. అంటూ లక్ష్మితో అంటే నవ్వేసింది లక్ష్మి. కోడలి మీద ఒక్కనాడన్నా ఒక్క పితూరి చెప్పని తల్లి. కొడుకు మీద చెప్పడంతో.

వారం రోజులు గడిచిపోయాయ్ !

"మురళీ... మీకు ఫోన్" అన్నాడు మురళితో —అతని కొలీగ్ రవి. వెంటనే లేచి ఫోనందుకున్నాడు మురళీధర్.

"హలో నేను పద్మజని —అత్తయ్య గారేంటో ఉన్న పళాన విరుచుకు పడి పోయారు. వెంటనే ఈ సంగతి వదిన వాళ్ళతో చెప్పి మీరు వెంటనే రండి... గాభరాగా చెప్పింది... షాక్ తిన్నాడు మురళి. అక్కకి ఫోన్ కలపబోతే ఎంగేజ్ వస్తోంది. మరింత కంగారు పడ్డాడు.

ఇంటి కెళ్ళాక ఫోన్ చేయొచ్చులే అనుకుంటూ వెళ్ళబోతుండగా మళ్ళీ మురళికి ఫోన్ వచ్చింది. వణుకుతున్న చేతులతో ఫోనందుకున్నాడతను.

"ఒరేయ్ ! మురళీ నేను లక్ష్మిని. అప్పుడోసారి జన్మదిన సంచిక కోసం పోటీ పెట్టారు చూడు , దానికి నేనో కథ రాసి పంపాను చూడు... ఆ..." కంగార్లో ఉన్న మురళి ఇంకేమీ వినిపించుకోకుండా "అక్కా ! నేను నీ కోసం ఇందాకట్నుంచీట్రై చేస్తున్నాను. అమ్మ పడిపోయిందట , పద్మజ చెప్పింది" అనేసి ఫోన్ పెట్టేశాడు.

"ఆ... నేనూ ... మీ బావగారూ వెంటనే ఫోన్ డిస్‌కనెక్ట్ అయింది.

వాళ్ళు వెళ్ళేసరికి భూజాతమ్మ పరిస్థితి నిమిషాల్లో ఉంది. మురళీధర్ ఒక్కసారి బావురుమన్నాడు. అప్పటికే కబురందుకుని వచ్చిన అతని అక్క —చెల్లెళ్ళ ఏడ్పు అలవికానిది.

లక్ష్మి తల్లిని ఒడిలోకి తీసుకుని "అమ్మా ! నీ కథ రాయమన్నావ్ కదామ్మా నీకు చెప్పకుండా రాసి అది ప్రింట్ కాగానే నీకు థ్రిల్ కలిగించేలా చెప్పాలనుకుంటే ఏంటమ్మా ఇది —నీ కథ ప్రింట్ అవడమే కాదమ్మా రెండో బహుమతిని కూడా గెలుచుకుంది" ఏడుస్తూ చెబుతున్న కూతురి మాటలు వింటుంటే కళ్లు తెరిచిందామె.. ఆవిడ మొహంలో ఎంతో సంతృప్తిచోటు చేసుకోవడం అంత బాధలోనూ మురళీధర్ గమనించాడు. తృప్తిగా మెరిసిన ఆ కళ్ళలోంచే ఆమె ప్రాణం పోయింది. అంతా ఘొల్లుమన్నారు.

* * *

అంత్యక్రియలు, ఆ తర్వాత దశ దిన కర్మలూ జరిగాయి. అన్నీ ఎంతో ఘనంగా, సంప్రదాయంగా నిర్వర్తించినందుకు అందరూ మురళీధర్‌ని మెచ్చుకున్నారు. వారి అభినందనలు, మెప్పుకోళ్ళు వింటూంటే అతని మనసు సిగ్గుతో ముడుచుకుపోసాగింది. తల్లి కోరికేంటో తెలిసీ తీర్చనందుకు డల్‌గా కూర్చున్న మురళీధర్ మనసుని డైవర్ట్ చేసేందుకు అతని చేతికి మాగజైన్ అందించింది "లక్ష్మి వదిన రాసిన కథ ఇదులో పడిందంటూ" ఆత్రంగా అందులోని కథ చదవడంలో నిమగ్నమయ్యాడు మురళీధర్.

"విలాసాల కోసం గుర్రప్పందాలు ఆడి అప్పులపాలయి భర్త తననీ, పిల్లల్నీ వదిలి వెళ్ళిపోతే ఒక అబల ఆ పరిస్థితుల నెంత ధైర్యంగా ఎదుర్కొన్నదీ, పస్తులతో గడిపినా ఆ రోజుల్లోనే పిల్లల నెలా తీర్చిదిద్ది ప్రయోజకులని చేసిందో వివరించింది. మరో ప్రక్క ఎన్నో అధునాతన సౌకర్యాలున్నా ఏ చీకూ చింతా లేని గవర్నమెంట్ ఉద్యోగం చేస్తూ ఇంటిని సవరించుకునేందుకే ఆపసోపాలు పడిన యువతి పాట్లతో పోలుస్తూ కథ నడపడంతో ఎంతో బాగా వచ్చింది. ఆమె చిరునవ్వుతో ముళ్ళబాటని పూల బాటగామలుచుకుంటే ఆధునిక యువతి పూలబాటని నడవడానికే ఇబ్బందిపడడం అంతా చక్కని కథనంతో చెప్పడం ఎంతో హృద్యంగా ఉంది. ఆ కథ నాసొంతం చదివిన మురళీధర్ నిజంగానే చాలా సిగ్గుపడ్డాడు. నిజ జీవితంలోని "కష్టేఫలి" అనే సందేశాలను కథల రూపంలో అందించకుండా సెక్స్, సస్పెన్స్ కథలంటూ అసందర్భపు కథలని రాసినందుకు —శృంగారానికి, సరసానికి ఉన్న తేడా తెలుసుకోకుండా రాసినందుకు కూడా. రచయితగా ఎంతో పేరున్న (?) తను ఇవ్వలేని ఆనందాన్ని, తృప్తిని, తన మొదటి కథ ద్వారానే అక్క తల్లి కందించిందన్న నిజం మనసుని ముల్లులా పొడుస్తుంటే —విలవిలలాడసాగాడతను. తల్లి ఎప్పుడు కథలు చదివి వినిపించమన్నా —ఆవిడ దయతోనే నాలుగు అక్షరమ్ముక్కలు నేర్చుకున్న నిజాన్ని మరిచి, నిర్లక్ష్యంతో తన కథల్ని ఆమె ఏం అర్థం చేసుకోగలదన్న అహంభావంతో ప్రవర్తించినందుకు ఎంతో పశ్చాత్తాపపడసాగాడు. తనలో అంతటి పొగరెందుకు చోటు చేసుకుందో. "నలుగురితో వారాయణా" అంటూ వ్యాపారానికి మారుపేరైన ఈ నాటి సాహిత్యంలో తనూ తనవంతుగా డబ్బు నాశించే రచనలు చేశాడు. రాసేవాడు డబ్బు నాశించడమే —ప్రచురించేవాడూ అంతే... వారు కోరినట్లు రాస్తున్నామని రచయిత, పాఠకుల కోరికను అనుసరించే ప్రచురిస్తున్నామని ప్రచురణ కర్త —ఇక ఉబుసుపోకకి ఏదైతే ఏంలే అనే పాఠకుడి నిర్లక్ష్య ధోరణి —కర్ణుడి చావుకెన్ని కారణాలో సాహిత్యం భ్రష్టు పట్టిపోడానికి ఇవన్నీ కారణాలే. తాత్కాలిక ఆనందానికి థ్రిల్‌కి తప్ప మరే ఉపయోగం లేని రచనలు టీనేజ్ పిల్లలపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయని, విమర్శనా దృష్టితో చూసుకున్న మురళీధర్‌కి ఎంతో ఆవేదన కలిగింది. తన తల్లి కథను వివరంగా నవలగా రాసి తల్లికే అంకితం ఇస్తానని నిర్ణయానికొచ్చాడు. "సాహిత్య ప్రయోజనం లేని కథల్ని ఇక మీదట తను రాయడు. ఈ సమాజానికి ఇంతో —అంతో మేలు చేసే రచనలు చేస్తేనే తల్లి ఆత్మ సంతోషి స్తుంది అనుకున్నాడు. ●



పెద్దలను గౌరవించవలెను. తల్లిదండ్రులను పూజించవలెను. అబద్ధం ఆడరాదు. నానిగాడు పాఠం చదువుతూ, అమ్మా అబద్ధం ఏదైనా ఆడకూడదా? తల్లినడిగాడు

ఔను. ఇప్పుడేమైంది?

ఉదయం నాన్నగారు మన ఇంటివెనకాల సిగరెట్టు తాగారు. నీకు చెప్పొద్దన్నారమ్మా అది అబద్ధమేగా?

డి. పాపయ్య, గుత్తి

"ఆపరేషన్‌కి ముందు ఫిఫ్టీ పర్సంట్ ఫీజు చెల్లించాలి" ఖచ్చితంగా చెప్పాడు డాక్టర్.

"ఇవేం రూలండీ బాబూ! ఆశ్చర్యపోయాడు పేషెంట్.

"అదంతేలే! మా డాక్టరుగారు ఆపరేషన్ చేసి బ్రతికి బయటపడడానికి ఫిఫ్టీ పర్సంట్ ఛాన్సే ఉంది మరి!" కాంపౌండర్ చెప్పాడు.

— శర్మ సిహెచ్., విజయవాడ

